# సలహా

మోటారు కంపెనీనుంచి వస్తున్న లక్ష్మీకాంతరావును ఎగాదిగా చూస్తే, ఏం ఇంతపొద్దున బయలుదేరావు ఇటు ?'' అన్నాడు రామారావు.

తల వంచుకుని 'ఆ కారు ఎంతచేస్తుందో తెలిసినవాళ్లకు ఎవరికయినా చూపించి ధరచేయాలి' అని యోచిస్తున్న లక్ష్మీకాంతము రామారావుని చూడగానే ఉలిక్కి పడ్డాడు.

కంపెనీలో ఉన్న స్నేహితుడితో మాట్లాడటానికి వచ్చానని సమాధానము చెప్పినా, మనసులో బాధగానే ఉంది తనమీద రాజ్యంతో ఏం చాడీలు చెప్తాడో అని. సహాయం లేకపోగా ఆలివంకవారు ఇందుకు పనికివస్తారు.

నాలుగేళ్లనుంచి అకౌంట్సు ఆఫీసరుగా పనిచేస్తున్న లక్ష్మీకాంతరావు సంసారాన్ని జాగ్రత్తగా, గౌరవంగా నెట్టుకొస్తున్నాడు. పొదుపు విషయానికి వస్తే, భర్త ఎంత పొదుపరో భార్య అంత జాగ్రత్త కలది. అట్లా అని వాళ్ల ఖర్చులంటే వెనుకడుగు వేసే రకముకాదు. అవసరాన్ని పట్టి, అతని పరిస్థితులనుపట్టి ఎప్పటికప్పుడు ఖర్చులే వస్తున్నాయి. అయినా సిగరెట్టుముక్కన్నా పీల్చే అభ్యాసం లేదు. కాబట్టి ఏదోకొంత నిలువచేశాడు. కొద్ది పిత్రార్జితంతో సంసారం గడుపుకుంటూ నిలవలో పడ్డాడంటే ఈ కాలంలో చెప్పుకోతగ్గ విషయమే అంటారు ఇరుగు పొరుగు. ఆ నిలువ కావటమే ఈమధ్య భార్యాభర్తలలో కొంత అశాంతిని పుట్టించింది.

ఏమిటంటే అసలుసంగతి–లక్ష్మీకాంతము మొదటినుంచీ ఏదో ఒక ఉద్దేశము మనసులో పెట్టుకొనే జాగ్రత్తగా డబ్బు వాడుకొనేవాడు కొంత నిలువ కాగానే ఆ ఊహను అమలుపరచాలని దృఢపరచుకున్నాడు. అప్పుడప్పుడు స్నేహితులతో 1945 సం. తాను రేడియో ఒకటి, చిన్న కారు ఒకటి కొంటానని చెప్తూ వచ్చాడు. ఆ మాటలు మెల్లగా రాజ్యం చెవినిపడ్డాయి. అదివరకు తనతో మాట మాత్రమయినా చెప్పని భర్త, అందరితో చెప్పటమే మొదలు ఇద్దరికీ.........

ఒకరోజున భర్తకు మజ్జిగ వడ్డిస్తూ, "మన పక్కనందు కవతలి వీధిలోని రెండవయిల్లు వేలము వేస్తున్నారు. పదిహేనువేలపై చిల్లరట విన్నారా?" అన్నది రాజ్యము. "వెధవది తుక్కు ఇల్లు అయి ఉండవచ్చు. అందుకే పదిహేనువేలు. మాటమాటకు రిపేరు చేయవలసివస్తుంది." అని కనుబొమలు ముడివేసి అన్నాడు లక్ష్మీకాంతము.

ఆ యిల్లు కొనమని భార్య అడగనూలేదు; భర్త నిరాకరించనూలేదు. అంతే ఆ సంభాషణ. ఇరుగు పొరుగు విషయంగా ఆమె చెప్పింది; తగిన సమాధానము ఇచ్చాడు అతడు.

దానితోటి ముక్తసరిగా మాట్లాడుకోవటం మొదలు పెట్టారు దంపతులు. కొన్నాళ్ళకు భోజనానికి లేవమని చెప్పటానికి రాజ్యముకు, వంటయిందా కనుక్కో అని అడగటానికి లక్ష్మీకాంతానికి, రామారావు అవసరమయినాడు. ప్రతివాళ్లకు కోపంరాగానే ఒక మధ్యవర్తి ఉంటే, వాళ్లతో కోపం వెళ్ళబోసుకుంటూ ఉంటారు. సంధి రాయబారాలు కూడా పెడ్తారు. తప్పంతా మధ్యవర్తిమీద పెట్టి చివరకు వారే తప్పుకొని కులాసాగా ఉంటారు

* * * *

"బాబుగారూ మీరు చెప్పండి కాస్త. ఏదో నాలుగు డబ్బులు నిలువ ఉన్నప్పుడే ఇల్లు అనేది చూస్తే బాగుంటుందని నా మనసులో ఉంది. ఏది చేసినా పిల్లలు ఎదగకముందే చూడాలి. పిల్లలు పెద్దవాళ్ళయితే ఖర్చు లెక్కువవుతాయి చదువులని సంధ్యలని. తరువాత మనం ఏం కట్టగలము చెప్పండి, ఇప్పుడు రేడియో అని, మోటారని కూర్చుంటే ఎట్లా? దీనికేమో వాటి ఖరీదుకాకుండా నెలనెలకు ఖర్చు. ఇల్లంటే ఒకసారి కొంటే ఇంక దమ్మిడీ అయినా ఖర్చులేదు. పైగా అద్దె ఇవ్వకుండా స్వంత ఇంట శాశ్వతంగా పడిఉంటుంది. మీరు కాస్త చెప్పండి ఆయనకు" అంది రాజ్యము నరసింహారావుతో.

నరసింహారావు లక్ష్మీకాంతానికి మేనమామ. రాజ్యానికి పినతండ్రి. ఇప్పుడు రిటైరు కావటమునుంచి ఉచితంగా బంధువులకు, ఇరుగుపొరుగవాళ్ళకు న్యాయమైన సలహాలిస్తూ ఉంటాడు. మంచి సానుభూతి చూపిస్తాడు ప్రతివాళ్ళ విషయంలో, ఎవరికీ మనసు నొప్పించకుండా తగవు పరిష్కారం చేయాలనే ఉద్దేశంతో, "రాజ్యం! చిక్కిపోయావెందుకూ ఈమధ్య" అన్నాడు.

"ఏమిటో బాబూ" అని తప్పించుకొన్నది రాజ్యం. దానితో రాత్రీ పగలు రాజ్యానికి ఇంటిధోరణి ఎక్కువయిందనీ, చాలా పట్టుదలగా ఉందనీ గ్రహించి, "కనుక్కుంటాలే రాజ్యం. నరేగాని పిన్ని లేవటంలేదు బొత్తిగా. వంటవాళ్ళకు ఎంతచెప్పినా సరిగా కుదరటములేదు పథ్యము. నాలుగు రోజులపాటు పథ్యం పానం ఇక్కడ ఉండి చూద్దూ. లక్ష్మీకాంతానికి నేను కబురు చేస్తాలే. భోజనానికి వస్తాడు" అన్నాడు యుక్తిగా.

తమలపాకులు వేసుకుంటూ "మామయ్యా! నాకు చాల ఇబ్బందిగా ఉంది ఆఫీసుకు వెళ్లటానికి. ఒకచిన్న కారు కొందామనుకుంటున్నా. మీ సలహా ఏమి" టని అడిగాడు లక్ష్మీకాంతం, అంతవరకు తనకారు విషయమై ఏ విధమైన రిపోర్టు పోలేదనే ఉద్దేశంతో.

"అయితే కారులేకపోతే ఇంకనుంచి గడవదంటావు. అంతేనా" అన్నాడు న్యాయశాస్త్రవేత్త.

"కాదుగాని అందరికీ ఉంది, నాకే లేదు అక్కడ. అందుకని నాకు చిన్నతనంగా ఉంది. ఇంతెందుకు-నాకంటె చిన్న ఉద్యోగి ఆస్టినులో ఎక్కి తిరుగుతాడు. నాలుగయిదు వందలుపెట్టి మంచి రేడియో కొన్నాడు ఈమధ్య. ఎంత బాగుందనుకొన్నారు. వాడి ఇంటికి వెళ్లితే నాకు రావలెనని బుద్ధిపుట్టదు" అన్నాడు.

"అవునులే. నాకు మాత్రము తెలియదూ నీ అవసరం? అయినా ఈ కాలపువాళ్లకు అవునన్నది కాదంటే జబ్బుచేస్తుంది. నీవూ మంచి యోజనాపరుడవేగా-నా సలహాకేం గాని" అని సముదాయించాడు.

ఎటువాళ్లకు అటు సర్దిచెప్పి సానుభూతి చూపిస్తూ మాట్లాడాడుగాని ఏ సలహా ఎవరికివ్వాలో ఆయనకేమీ పాలుపోలేదు. అన్నాళ్ల జిల్లాజడ్జి పనిచేశాడు-అన్ని కేసులుతీర్పుచెప్పాడు-అంతమందికి సలహాలిచ్చాడు-ఇప్పటికి ఆ వాడలో ఏ తగవు వచ్చినా పరిష్కారం చేస్తాడు, అత్తా కోడళ్ల తగవులతో సహా. అటువంటి ఆయన ఈ దంపతుల కిద్దరికీ సలహా ఇవ్వలేకుండా ఉన్నాడు.

తల్లిదండ్రీ పోయినప్పటినుంచి, తననే తల్లిదండ్రిగా భావించిన రాజ్యాన్ని భర్తమాట విని కారుకొనమంటే ఎంత చిన్నబుచ్చుకుంటుదో-ఆడపిల్ల!

పోనీ ఇల్లు తీసుకొనవయ్యా కారుకేం తొందర అంటే-లక్ష్మీకాంతం-అసలే కచ్చమనిషి-తనకు అనుగుణంగా సలహాయిస్తేనే తప్ప, లేకపోతే గడప అయినా తొక్కడు.

ఎవరికి ఎటు సమాధానము చెప్పకుండా గోడమీదపిల్లివాటంగా మాట్లాడుతూ దినాలు గడుపుతున్నాడు.

ఎవరివైపు తీర్పుచెప్తాడో అని భార్యకూ ఆందోళనే- భర్తకూ ఆందోళనే. కదిలిస్తే రంగం చెడుతుందని ఒక భయం మళ్లీ యిద్దరికు. సలహా లేకుండానే సమాధానపెట్తూ, దినాలు దాటవేస్తుంటే ఇద్దరికీ కష్టంగానే ఉంది

ఎవరికయినా ఎన్నాళ్ళుంటుంది ఓపిక? తన వ్యవహారాలే గాని ఇంకోటిలేదు ఆయనకు!

చివరకు విసుగెత్తి "ఏం మామయ్యా ఊరుకున్నా"రని బొమలు ముడి వేస్తూ అడిగాడు లక్ష్మీకాంతం.

"నాయనా తొందరపడితే పనులవుతాయా? నీ ఆలోచన బాగానే ఉంది. ముఖ్యంగా ఉండవలసినవే కారు, రేడియో. అక్కడక్కడ కంపెనీలలో చెప్పి ఉంచు. నేనూ చూస్తూ ఉంటాలే" అన్నాడు నరసింహారావు.

"ఆ యిల్లు మరీ యిరుకుసందులో ఉందమ్మా. ఎక్కడయినా రోడ్డుమీద ఉన్న స్థలముగాని, ఇల్లుగాని బేరంచేస్తూ ఉంటాలే లక్ష్మీకాంతము ఏదయినా అడావడి చేస్తే నొచ్చుకోకు. నీ సంగతి నాకు తెలియదా ఏమిటి?" అని రాజ్యాన్ని సమాధానపెట్టాడు.

ఒకటి రెండుసార్లు కంపెనీల నుంచి సెకండ్‌హాండ్ కార్లు తీసుకొచ్చాడు లక్ష్మీకాంతం చూపించటానికి, రోడ్డు చివరదాకా కారులో తిరిగి "అబ్బే పదినాళ్లు ఉండదురా ఇది" అని పెదవి విరిచాడు నరసింహారావు.

తప్పకుండా మామ మెచ్చుతాడనే ఉద్దేశంతో ఉన్న లక్ష్మీకాంతానికి ఈ మాటలు వినగానే మింగుదామన్నంత కోపం వచ్చేది మనసులో, ఒకసారి ఆయన యిచ్చిన సలహాను పాటించకపోతే యింక పలుకరించనైనా పలుకరించని స్వభావం నరసింహారావుగారికి. ఆ సంగతి బాగా ఎరిగిఉన్నాడు లక్ష్మీకాంతం.

ఈ విధంగా ఏదీ పడనివ్వడని తాత్కాలికమైన కోపాలతో గడుపుతున్నారు దంపతులు.

రాజ్యం చిన్నబుచ్చుకున్నప్పుడు లక్ష్మీకాంతం తనమాటే నెగ్గుతుందనుకొనే వాడు. లక్ష్మీకాంతం హతాశుడైనప్పుడు రాజ్యము తానే గెలుస్తాననుకొనేది.

నాలుదు-అయిదు సంవత్సరాలు ద్దొర్లిపోయాయి,

* * * *

సంవత్సరాది పండుగకు దంపతుల నిద్దరిని తన యింటికి ఆహ్వానించాడు నరసింహారావు.

భోజనాలయిన తరువాత ఊరికి పడమరవైపు తోటలోకి వెళ్దాము రండని పిలుచుకొని పోయాడు.

జర్మన్ డిజైనులో కట్టబడిన చిన్న బంగళా-చుట్టూ చిన్నతోటా — ఒక ప్రక్కగరాజ్ అందులో టూసీటర్ కారు-అన్నీ చూపిస్తూ తోటలో ఉన్న సిమెంటు సీట్లమీద కూర్చోబెట్టి మాట్లాడుతున్నాడు నరసింహారావు.

ఇంతలోకే బంగళా లోపలినుంచి రేడియోపాట:

దంపతులిద్దరు ఆనందభాష్పాలతో నరసింహారావు గారికి ఒక్కసారే నమస్కరించారు.